## క్లుప్తంగా

### నృత్య విభాగంలో ఉగాది నంది పురస్కారం


ఉగాది నంది పురస్కారంతో చిన్నారి ఐశ్వర్య

**అమలాపురం టౌన్:** పట్టణంలోని నల్లవంతెన వద్ద గల శ్రీకళా క్షేత్రంలో నృత్యం అభ్యసిస్తున్న విద్యార్థిని తురగా భానుశ్రీ ఐశ్వర్య కాకినాడలో జరిగిన సూర్య నృత్య కళా నికేతన్ 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఉగాది నంది పురస్కారాన్ని అందుకున్నట్లు కళా క్షేత్రం డైరెక్టర్ పి.శ్రీ కామేశ్వరిదేవి తెలిపారు. ఐశ్వర్య తల్లిదండ్రులు తురగా సూర్య శ్రీనివాస్, కల్యాణి తమ కుమార్తె నంది పురస్కారం అందుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూలులో ఐశ్వర్య మూడో తరగతి చదువుతోంది. పురస్కారం అందుకున్న ఐశ్వర్యను ఆ స్కూలు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

### ఆదిలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవం

**అమలాపురం రూరల్:** మండలంలోని ఎ.వేమవరం గ్రామ దేవత బూరుగులమ్మ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ 8వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, లింగోలు పండు అమ్మవారికి పూజలు చేశారు.

### ఇమామ్ అలీకి నివాళులు


ఇమామ్ అలీ జీవిత విశేషాలను వివరిస్తున్న మత గురువు హైదర్ అలీ

**అమలాపురం టౌన్:** షియాల ఆరాధ్య దైవం మొదటి ఖలీఫా మహ్మద్ ప్రవక్త అల్లుడు హజరత్ ఇమామ్ అలీ వర్ధంతి కార్యక్రమం స్థానిక 12వ వార్డులోని ఆస్థానే అబ్బాసియ పీర్ల పంజాలో సోమవారం జరిగింది. ఇమామ్ అలీ జీవిత విశేషాలను, విషాద ఘట్టాలను ఒడిశా నుంచి వచ్చిన మత గురువు మహ్మద్ హైదర్ అలీ వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమలాపురం పట్టణం తదితర గ్రామాలకు చెందిన షియా మతస్తులు ఇమామ్ అలీకి ఘనంగా నివాళులర్పించారు. మసీదు అధ్యక్షుడు నిసార్ హుస్సేన్, కార్యదర్శి కర్రార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు వైద్య పరీక్షలు

**ముమ్మిడివరం:** స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఎన్.వినయ్‌కుమార్(ఆర్థోపెడిక్), చందన(ఆప్తమాలజిస్ట్), టి.వినయ్‌కుమార్(ఈఎన్‌టీ), ఎం.నీలిమ(ఆడియాలజిస్టు) 180 మందికి వైద్య పరీక్షలు చేశారు. 83 మందికి చలన వైకల్యం, 62 మందికి వినికిడి లోపం, 35 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా అదనపు పథక సంచాలకులు ఎ.మధుసూదనరావు, సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ ఎం.వీర సత్యనారాయణ, ఎఫ్ఏఓ బి.ప్రవీణ్‌కుమార్, ఏఎంఓ పి.రాంబాబు, ఏపీఓఎం ఏకే బీమారావు పాల్గొన్నారు.

### తాచు పాము హల్ చల్


అనాతవరంలో పామును బంధిస్తున్న గణేష్‌వర్మ

**ముమ్మిడివరం:** మండలంలోని అనాతవరం పంచాయతీ పరిధి మునుకోటివారి పాలెంలో మునుకోటి సత్యనారాయణ ఇంట్లో తాచుపాము హల్‌చల్ చేసింది. ఇంటి ఆవరణలోకి పాము ప్రవేశించడంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్ స్నాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకుని పామును డబ్బాలో బంధించారు. దీంతో స్థానికులంతా ఊపిరి పీల్చుకున్నారు. వేసవి కాలం నేపథ్యంలో పంట పొలాలు, పొదల్లో ఉండే పాములు నివాస ప్రాంతాలకు వచ్చే ప్రమాదముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

### పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మార్గదర్శకాలు పాటించాలి

**యానాం:** పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగానికి సంబంధించి ఎన్నికల కమిషన్ జారీచేసిన మార్గదర్శకాలను పాటించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా స్పెషల్ ఓటర్లు, సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది, 85 ఏళ్లకు పైబడి వయసున్న ఓటర్లు, దివ్యాంగులు, కోవిడ్-19 అనుమానితులుగా బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకోవచ్చన్నారు. యానాం నియోజకవర్గంలో 21 మంది సర్వీసు ఓటర్లున్నారన్నారు. 302 మంది దివ్యాంగులు, 85 ఏళ్ల దాటిన వృద్ధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి వద్దే ఓటు వేస్తారన్నారు. ఈ బ్యాలెట్ బాక్సులను తీసుకు రావడానికి ఐదు బృందాలను నియమించామన్నారు.

# పింఛన్లు ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుపడ్డారు


ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్

- వాళ్లు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీదే విజయం
- ఎన్నికలు అవ్వగానే వలంటీర్ వ్యవస్థను పునర్నిర్మిస్తాం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

**అల్లవరం:** ఎలక్షన్ కోడ్‌ని అడ్డుపెట్టుకుని ఎలక్షన్ కమిషన్‌పై ఒత్తిడి తీసుకొచ్చి అవ్వతాతలకు పింఛన్లు ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుపడ్డారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని దేవగుప్తం, ఎంట్రుకోన గ్రామాల్లో ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలిసి సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌లకు మహిళలు హారతులిచ్చి నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ యావత్తు ప్రపంచాన్ని కరోనా మహమ్మారి చుట్టుముట్టిన విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఇంటింటికి వెళ్లి సేవలను అందించిన వలంటీర్ల వ్యవస్థని నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు తొలి నుంచి కుట్రలు చేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రిక అని కొనియాడారు. చంద్రబాబు అండ్ కో కుటిల రాజకీయాలతో వలంటీర్లను పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకుని లక్షలాది మంది పింఛన్‌దారులు సచివాలయాల వద్ద పడిగాపులు పడవలసిన దయనీయ పరిస్థితి తీసుకొచ్చారన్నారు. వారెన్ని కుయుక్తులు పన్నినా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధిస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వెంటనే వలంటీర్ వ్యవస్థను పునర్నిర్మిస్తామని చెప్పారు. చంద్రబాబు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనించి ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి సంక్షేమ పథకాల సారథి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, తిక్కిరెడ్డి శ్రీను, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, జీఎస్‌కే చైర్మన్ తిక్కా ప్రసాద్, రైతు విభాగ అధ్యక్షుడు కుడుపూడి సూర్యప్రకాశరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, బూలా లోక్‌నాథ్, సాధనాల శ్రీను, చింతా రామకృష్ణ, వాసర్ల శ్రీమన్నారాయణ, మొల్లేటి సత్యసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్లను అడ్డుకోవడం టీడీపీ, జనసేనల కుట్రే


జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్

**అమలాపురం టౌన్:** పలు సంక్షేమ పథకాలతో పాటు ప్రతి నెలా పింఛన్‌దారులకు తెల్లవారుజామునే ఇళ్లకు వచ్చి పింఛన్ సొమ్ములు ఇస్తున్న వలంటీర్ల సేవలను అడ్డుకోవడం టీడీపీ, జనసేనలు చేసిన కుట్రేనని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ ధ్వజమెత్తారు. అమలాపురంలో ఆయన సోమవారం స్థానిక మీడియాతో మాట్లాడారు. పింఛన్ డబ్బుల కోసం ఒకటో తారీఖు వస్తుందంటే ఇళ్ల వద్ద వలంటీర్ల కోసం ఎదురు చేసే అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు ఇప్పుడు వారి సేవలు లేవని తెలిసి బెంబేలెత్తిపోతున్నారని చెప్పారు. వార్డు లేదా గ్రామ సచివాలయాలకు, పంచాయతీలకు వెళ్లి పింఛన్ తీసుకోవాలని తెలిసి ఇదంతా చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన అన్యాయమేనని బాధపడుతున్నారన్నారు. టీడీపీ, జనసేనల నిర్వాకం వల్ల ఒకటో తేదీన అందాల్సిన పింఛన్ ఈ నెల 3వ తేదీకి వాయిదా పడిందని చెప్పారు. సచివాయాలకు, పంచాయతీలకు వెళ్లాలంటే పండుటాకులైన వృద్ధులు, నడవ లేని దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు ఇప్పటి నుంచి ఆందోళనకు గురవుతున్నారని ఖాదర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజు పింఛన్ తీసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయానికి తీసుకెళ్లమంటూ ఎవరొకరిని బతిమలాడుకునే దుస్థితి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఏదో మేలు చేసేస్తారన్న అపోహతో టీడీపీ, జనసేన చేస్తున్న దుశ్చర్యను ప్రజలు ముఖ్యంగా పింఛన్ లబ్ధిదారులు గమనిస్తూనే ఉన్నారని ఖాదర్ స్పష్టం చేశారు.

## వైఎస్సార్ సీపీ హయాంలోనే మాదిగలకు సముచిత స్థానం


మాదిగ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

**అల్లవరం:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మాదిగలకు సముచిత స్థానం లభించిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని ఎంట్రుకోన గ్రామంలో సోమవారం రాత్రి మాదిగలతో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలందరూ వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని, మన ఓటు ద్వారా చెప్పాలన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న విశ్వరూప్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులను గెలిపించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాదిగ నాయకులు పాల్గొన్నారు.

# టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు


పిల్లంకలో వైఎస్సార్ సీపీ కండువా వేసి నానిబాబు రాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్


వైఎస్సార్ సీపీ కండువా మెడలో వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి విశ్వరూప్

**తాళ్లరేవు:** టీడీపీ సీనియర్ నాయకుడు సాగి నానిబాబు రాజు సోమవారం తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల పరిధిలోని పిల్లంకలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో నానిబాబు రాజుకు ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నానిబాబు రాజు మాట్లాడుతూ 40 ఏళ్లుగా టీడీపీ పార్టీలో కొనసాగిన తనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఎంతగానో నచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నానన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, యువజన విభాగం అధ్యక్షుడు మట్టపర్తి లోవరాజు, సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, సాగి హరిబాబు, జంపన అజయ్, కనుమూరి వెంకటేశ్వరరాజు, సాగి బొజ్జిరాజు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

### మంత్రి సమక్షంలో చేరికలు

**అల్లవరం:** మండలంలోని ఎంట్రుకోన పంచాయతీ పరిధిలో అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి విశ్వరూప్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ఈటీవారి పాలెం గ్రామస్తులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌లు వైఎస్సార్ సీపీ కండువా మెడలో వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని మోటూరి ఉదయ్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఈటి రామారావు, తిక్కిరెడి బాబురావు, పాటి వినాయకరావు, వర్రే లక్ష్మి, తిక్కిరెడి రాముడు తదితరులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కన్నె పాముల రాంబాబు, నార్గన శ్రీను, నవుండ్రు నాగరాజు పాల్గొన్నారు.

# యానాం అభివృద్ధి కోసమే మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అశోక్

**యానాం:** యానాం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా ఉన్న తాను బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమికి మద్దతిస్తున్నానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. సోమవారం స్థానిక యర్రాగార్డెన్స్‌లోని మినీగాజుల గార్డెన్స్ ఫంక్షన్ హాలులో నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ యానాం అభివృద్ధి చెందాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా అవసరమన్నారు. నమశ్శివాయం గెలిచిన వెంటనే కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకుంటారన్న చర్చ సాగుతుందని, అదే జరిగితే యానాంకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అందుకే ఈ నెల 19న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి నమశ్శివాయంకు ఓటువేయాలని కోరారు. యానాం అభివృద్ధికి తాను సహకరిస్తానని నమశ్శివాయం తనకు హామీ ఇచ్చారన్నారు. మత్స్యకారుల అభివృద్ధి, ఇళ్ల పట్టాలు, యువతకు ఉపాధి కల్పన చేస్తారని చెప్పారన్నారు. తనకు నామినేటెడ్ పదవి ఇస్తానన్నా కాదని యానాం అభివృద్ధే ముఖ్యమని తాను ఇండిపెండెంట్‌గానే ఉన్నానన్నారు. కార్యక్రమంలో నాయకులు కనకాల రాజు, రేకాడి ఆదినారాయణ, లోవరాజు, రామదాసు, పండు సిద్దార్థ, సబ్బతి లోకేశ్వరరావు, కాకి నాగేశ్వరరావు, దుగ్గదుర్తి అనిత, దంగుడు బియ్యం సత్యనారాయణ, ఎస్ఆర్ఎంటీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ ఎల్లారావు

**ముమ్మిడివరం:** జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో రైతుల నుంచి 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎల్లారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 377 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఇప్పటికే తమ కార్యాలయంలో రబీ రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లపై క్షేత్ర స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. దళారులు, మిల్లర్ల చేతుల్లో రైతులు నష్టపోకుండా రైతు భరోసా కేంద్రాలు కొనుగోలు కేంద్రాలుగా పని చేస్తాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర సాధారణ రకం క్వింటాకు రూ.2,183, గ్రేడ్ ×ఏ॥ రకం క్వింటాకు రూ.2,203 ప్రకారం కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. అలాగే సాధారణ రకం 75 కేజీలు రూ.1,637, గ్రేడ్ రకం 75 కేజీలు రూ.1,652 ధర ఇస్తున్నామన్నారు. నిబంధనల మేరకు వ్యర్థ పదార్థాలు, మట్టి, రాళ్లు వంటివి మూడు శాతం, పరిపక్వం లేని, ముడుచుకు పోయిన వంకర తిరగిన ధాన్యం గింజలకు మూడు శాతం, తేమ శాతం 17 శాతం మించి ఉండరాదనే విషయాలపై క్షేత్ర స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలున్నా జిల్లా కంట్రోల్ రూమ్‌లోని 83094 32487, 94416 92275 నెంబర్లకు రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల లోపు సంప్రదించవచ్చన్నారు.

# పాఠశాలల్లో ఘనంగా ప్రవేశ ఉత్సవాలు


అయ్యన్ననగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం

**యానాం:** నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం నుంచి పాఠశాల ప్రవేశ ఉత్సవాలు, బడిబాట కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక భీమ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం పోతాబత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అయ్యన్ననగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎస్ఏ కమిడి ప్రభాకరరావు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సరస్వతీ పూజ, పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. గ్రామవీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం వలీ, దొమ్మేటి కృష్ణార్జునులు, రవిశంకర్, కిరణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు వలంటీర్ల రాజీనామా

**తాళ్లరేవు:** మండల పరిధిలోని పిల్లంక సచివాలయం పరిధిలో గోవలంక గ్రామానికి చెందిన వలంటీర్లు కాశి ఎమ్మెల్యే ఏడుకొండలు, పోతుల పవన్ కల్యాణ్ సోమవారం తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ప్రతిపక్ష పార్టీలు వలంటీర్లపై లేనిపోని రాద్ధాంతం చేస్తుండడం, ప్రధానంగా పింఛనుదారులకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారని అందువల్లే తాము రాజీనామా చేసినట్లు తెలిపారు.

# రాజకీయ పార్టీల నేతలతో సమావేశం


వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన ఆర్ఏఓ మునిస్వామి

**యానాం:** పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలుపై చర్చించేందుకు సోమవారం ఆర్ఏఓ మునిస్వామి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయా రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాల్లో నిబంధనలను అతిక్రమించకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దినేష్, బీఎస్పీ అధ్యక్షుడు ధూళిపూడి మధు, డీఎంకే అధ్యక్షుడు భాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ కచ్చితంగా పాటించాలి


పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

**అల్లవరం:** కేంద్ర ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల కోడ్‌ను అన్ని పార్టీలు కచ్చితంగా పాటించాలని తహసీల్దార్ సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులతో ఎలక్షన్ నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనుమతులు తీసుకోకుండా ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, ఈఓపీఆర్‌డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, మండల బీజేపీ అధ్యక్షుడు సుంకర సాయి, జనసేన నాయకుడు మోకా బాలయోగి పాల్గొన్నారు.

# పని చేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు


వీఆర్వో నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న తహసీల్దార్ విమలకుమారి

**అంబాజీపేట:** విధి నిర్వహణలో ప్రజల మధ్యే ఉంటూ వారికోసం పని చేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ జె.విమలకుమారి అన్నారు. గంగలకుర్రు వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న వక్కలంక నాగేశ్వరరావు సన్మాన సభను అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే వారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అనంతరం నాగేశ్వరరావు, నాగమణి దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.నాగపద్మ, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వోలు, వీఆర్ఏలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# సంక్షేమం కొనసాగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి


ఇంజరం పంచాయతీలో ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు


గోపులంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్
- లంక గ్రామాల్లో జోరుగా ప్రచారం

**తాళ్లరేవు:** ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని లంక గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుతో కలిసి పొన్నాడ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పిల్లంక గ్రామ పంచాయతీలో స్థానిక గ్రామ దేవతల ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ప్రచారాన్ని ప్రారంభించారు. గోవలంక, గోపులంక, అరటికాయలంక, గోపాలపురం, ఇంజరం గ్రామ పంచాయతీలలో విస్తృత ప్రచారం చేశారు. పలుచోట్ల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెయ్యల మంగేష్, వెంటపల్లి నూకరాజు, ముద్దన వెంకట శివరామప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, మోర్త భీమాబాయి, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, రేవు మల్లీశ్వరి, పెట్ల శాంతకుమారి, పోతుల రత్నకుమారి, వాసంతి, నూకరత్నం, మండల ప్రధాన కార్యదర్శులు యర్రంనీడి అప్పారావు, మోకా మధుబాబు, బొంతు మోహన్, అరదాడి అన్నవరం, మండల యువజన విభాగం అధ్యక్షుడు మట్టపర్తి లోవరాజు, మండల సేవాదళ్ అధ్యక్షుడు భూసారపు పద్మారావు, సాగి నానిరాజు, జంపన అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రింటర్ బహూకరణ


కేశనపల్లిలో పాఠశాలకు ప్రింటర్ అందిస్తున్న సర్పంచ్ యెనుముల నాగు

**మలికిపురం:** కేశనపల్లి యెనుముల బ్రహ్మానందం జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన అడబాల లక్ష్మీ నరసింహమూర్తి రూ.35 వేలు విలువైన డూప్లెక్స్ ప్రింటర్‌ను బహూకరించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ యెనుముల నాగు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆనందం రాంబాబు చేతుల మీదుగా దీనిని అందించారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు .ఉమామహేశ్వరరావు శ్రీను పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశం

**సఖినేటిపల్లి:** సఖినేటిపల్లిపాలెం సెంటర్‌లోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం మండల భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో తాపీ మేస్త్రిలకు ప్రమాద బీమా కార్డులను సంఘ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి భవన నిర్మాణ కార్మికుడు ప్రమాద బీమా కార్డు తప్పనిసరిగా చేయించుకోవాలని, ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో ప్రభుత్వం నుంచి సాయం పొందడానికి కార్డు తప్పనిసరి అన్నారు. అలాగే బీమా కార్డులను కూడా రెన్యువల్ చేయించుకోవాలని వెంకటేశ్వరరావు సూచించారు. సంఘ ఉపాధ్యక్షుడు గంటా శ్రీను, కార్యదర్శి సత్తిబాబు, మేళ్ల తులసీనాథ్, సంఘ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం

**మామిడికుదురు:** అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం కొత్తపేటకు చెందిన మల్లంపల్లి శేషగిరి రూ.25,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. విరాళం అందించిన దాతకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి వారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనం అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.